సాక్షి
రంగారెడ్డి

గురువారం । 6 । జూలై । 2023



రూ.100 కోట్లతో అభివృద్ధి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. 8లో▸



రూ.6 లక్షలు ఇవ్వాలి

గృహలక్ష్మి పథకానికి రూ.6లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. 8లో▸



సమష్టి కృషితోనే..

కార్మికుల సమష్టి కృషి వల్లే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఆర్టీసీ డిపోగా ఇబ్రహీంపట్నం నిలిచిందని డీఎం అశోక్‌రాజు అన్నారు. 8లో▸

మహేశ్వరంలో వైద్య కళాశాల

వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు

- మెడికల్ కళాశాలకు అనుబంధ ఆస్పత్రి
- అందుబాటులోకి రానున్న 100 ఎంబీబీఎస్ సీట్లు
- మీర్‌ఖాన్‌పేటలో వంద ఎకరాలు కేటాయింపు!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల ఏర్పాటుతో 100 ఎంబీబీఎస్ సీట్లతో పాటు అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కూడా అందుబాటులోకి రానుంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గత నెల 19న మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరులో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మెడికల్ కళాశాల మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ కళాశాల ఏర్పాటుతో కందుకూరు, మహేశ్వరం, ఆమనగల్లు, తలకొండపల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

మీర్‌ఖాన్‌పేట వైపే మొగ్గు

ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మెడికల్ కళాశాలను ఏ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయనున్నారనే అంశంపై ఇంకా స్పష్టత లేదు. అయితే కళాశాల ఏర్పాటుకు అవసరమైన భూమి, రవాణా సదుపాయం, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం భారీగా భూములు సేకరించిన విషయం తెలిసిందే. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల నుంచి 19,333 ఎకరాల భూమి సేకరించింది. ఇక్కడ వంద ఎకరాల భూమిని కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీశైలం జాతీయ రహదారికి, అటు యాచారం ఫార్మాసిటీకి మధ్యలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

మారనున్న రూపురేఖలు

ఇప్పటికే ఇక్కడ అమేజాన్ డేటా సెంటర్, పవర్ గ్రిడ్ సహా 400 కేవీ సామర్థ్యంతో కూడిన సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. తాగునీటి అవసరాల కోసం కృష్ణ జలాలను ఇక్కడికి తరలించాలని నిర్ణయించి ఆ మేరకు పైపులైన్ల ఏర్పాట్లుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. భూ బాధితులు సహా, ఫార్మా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, కూలీలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఈ పరిసరాల్లో స్థిరపడే అవకాశం ఉంది. కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు భవిష్యత్‌లో మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు కానున్న మెడికల్ కళాశాల కోసం బహుళ అంతస్తుల భవనంతో పాటు అనుబంధ ఆస్పత్రి భవనం, ప్రొఫెసర్లు, సిబ్బందికి క్వార్టర్లు, వైద్య విద్యార్థులకు అవసరమైన వసతి గృహాలు నిర్మించనున్నారు. వీటికి అదనంగా మరి కొన్ని భవనాలు రానున్నాయి. ప్రభుత్వ తాజా ప్రకటనతో భూముల ధరలు ఆకాశాన్నంటే అవకాశం లేకపోలేదు. కళాశాల ఏర్పాటుతో ప్రజల జీవనశైలి కూడా పూర్తిగా మారనుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నాగార్జునసాగర్, అటు శ్రీశైలం జాతీయ రహదారులతో తరచూ వెలుగు చూసే రోడ్డు ప్రమాదాలు, గాయపడిన క్షతగాత్రులకు తక్షణ వైద్యసేవలు అందనున్నాయి.



మీర్‌పేటలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

సీఎం సార్.. థ్యాంక్స్

మహేశ్వరం నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ బుధవారం జీవో జారీ చేయడం హర్షణీయమని విద్యాశాఖ మంత్రి పి.సబితా రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. దినదినాభివృద్ధి చెందుతున్న మహేశ్వరం ప్రాంతంలో పెద్దఎత్తున ఏర్పాటు అవుతున్న ఫ్యాక్టరీలు, అంతర్జాతీయ సంస్థలతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి అతి దగ్గరగా ఉండటంతో మెడికల్ కళాశాల, ఆస్పత్రి మంజూరు చేయటం పట్ల స్థానికులు హర్షం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

జల్సా కోసం అడ్డదారులు

నకిలీ ఆర్టీఏ పత్రాలను సృష్టిస్తున్న ఆరుగురు నిందితుల అరెస్టు



నకిలీ పత్రాలతో నిందితులు

ఇబ్రహీంపట్నం రూరల్: జల్సాలకు అలవాటుపడి నకిలీ ఆర్టీఏ పత్రాలు సృష్టించి విక్రయిస్తున్న ముఠాను ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆదిబట్ల సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. సంగిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, కొంగల ఆనంద్, అడుశెట్టి వేణు, పుట్టబత్తిని శ్రీధర్, అనుపాటి శ్రీశైలం, చాపల యాదగిరి మన్నెగూడ సమీపంలోని ఇబ్రహీంపట్నం ఆర్టీఏ కార్యాలయం వద్ద ప్రైవేట్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, వెహికిల్ ఫిట్‌నెస్, బ్యాంకు ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు.. ఇలా ఆర్టీఏకు కావాల్సిన ఏ పత్రాన్ని అయినా తయారు చేసి ఇస్తారు. ప్రతి సర్టిఫికెట్‌కు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేసేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కంప్యూటర్లు, నకిలీ ఆర్టీఏ పత్రాలు, పెన్ డ్రైవ్, నకిలీ ఆధార్‌కార్డులు, నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు

యాచారం పోలీసులపై రాచకొండ సీపీకి ఫిర్యాదు

యాచారం: భూ వివాదంలో యాచారం పోలీసులు తమపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని కొత్తపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 205, 206లో 4.20 ఎకరాల భూమికి సంబంధించి తమకు పట్టాదారు, పాసు పుస్తకాలున్నా.. కావాలనే ప్రత్యర్థుల మాటలు నమ్మి తమపై ఐదు కేసులు నమోదు చేశారన్నారు. స్పందించిన సీపీ.. యాచారం పోలీసులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ వివాదంపై పూర్తి విచారణ జరిపి నివేదిక అందజేయాలని మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ను ఆదేశించారు.

రోనాల్డ్ రాస్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్‌గా రోనాల్డ్ రాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన లోకేశ్‌కుమార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు లోకేశ్‌కుమార్‌కు వీడ్కోలు, రోనాల్డ్ రాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అడిషనల్ కమిషనర్లు ప్రియాంక అలా, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనెడీ, జోనల్ కమిషనర్లు మమత, పంకజ, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఈఎన్‌సీ జియావుద్దీన్, సీసీపీ దేవేందర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ సీఈ దేవానంద్, హౌసింగ్ ఓఎస్డీ సురేష్‌కుమార్, పలువురు డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

లోకేశ్‌కుమార్‌కు కేటీఆర్ అభినందనలు

సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘ కాలం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పనిచేసి బదిలీ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారి లోకేశ్‌కుమార్‌కు మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. లోకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ అనేక కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నగరంలో మౌలిక వసతుల కల్పన, ప్రజా రవాణాను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఎస్సార్‌డీపీ, లింక్ రోడ్ల నిర్మాణం, ఎస్‌ఎన్‌డీపీ వంటి వ్యూహాత్మక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఆయన చేసిన కృషికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. లోకేశ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మితో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, జలమండలి ఎండీ దాన కిషోర్, జీహెచ్‌ఎంసీ నూతన కమిషనర్ రోనాల్డ్ రాస్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, జోనల్, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్.. అత్యాచార యత్నం

- ప్రతిఘటించి తప్పించుకున్న బాధితురాలు
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీ స్టేషన్ పరిధిలో ఓ బాలికను అపహరించి లైంగిక దాడి యత్నం చేయగా.. దుండగులను ప్రతిఘటించి తప్పించుకుంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ కథనం ప్రకారం... పెద్దఅంబర్‌పేట్‌లో నివసించే ఓ బాలిక(17) పదో తరగతి వరకు చదివి ఇంటివద్దనే ఉంటోంది. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు బైకుపై వచ్చి బాత్రూంకు వెళుతున్న బాలికను పిలిచి అడ్రస్ తెలపమని ఫోన్ చూపించాడు. ఆమె ఫోన్ చూస్తుండగానే ఆ అడ్రస్‌కు తీసుకెళ్లమని కోరి బైకుపై ఎక్కించుకుని వెళ్లాడు. మధ్యలో మరో యువకుడు బైకుపై ఎక్కాడు. వారిద్దరు బాలికను బైకుపై ఔటర్ రింగురోడ్డు సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లారు. అక్కడ ఓ చిన్నరూంలోకి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించారు. భయాందోళనకు గురైన బాలిక ప్రతిఘటించి వారి నుంచి తప్పించుకుని జాతీయ రహదారిపైకి చేరింది. రోడ్డుపై తచ్చాడుతున్న బాలికను గమనించిన ఓ హిజ్రా ఆమెను ప్రశ్నించగా.. తన తల్లికి ఫోన్ చేయమని కోరింది. తల్లి స్పందించక పోవడంతో పక్కనే ఉన్న హోటల్ వద్దకు వెళ్లి వారి సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితికి చేరిన బాలికను చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలిక తప్పించుకుని చెట్ల పొదల నుంచి రావడం వల్ల చిన్న చిన్న గాయాలయ్యాయని, ఆమెకు వైద్య పరీక్షలు చేయించామని లైంగికదాడి జరగలేదని డీసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కాగా దుండగులు బాలికపై మత్తుమందు స్ప్రే చేశారని అనుమానిస్తున్నారు. ఇద్దరు నిందితులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

రెండు రోజుల్లో శుభకార్యం.. అంతలోనే తీరని శోకం

- రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి
- బంధువులకు చెప్పి వస్తుండగా ఘటన
- మొండిగౌరెల్లిలో విషాదం



కర్నాటి నారమ్మ



యాదయ్య

యాచారం: రెండు రోజుల్లో శుభకార్యం.. ఇంతలోనే ఆ ఇంట్లో తీరని విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందడంతో శోకసంద్రమైంది. మండల పరిధిలోని మొండిగౌరెల్లిలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్నాటి నారమ్మ(50) ఆమె కొడుకు యాదయ్య తమ ఇంట్లో ఈ నెల 7న జరిగే శుభ కార్యం కోసం హయత్‌నగర్‌లోని తమ బంధువులకు చెప్పి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో మరో బంధువు ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన యాదయ్య నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లీకుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యాదయ్య కూతురి శారీ ఫంక్షన్ జరగాల్సి ఉండగా విషాదం నెలకొనడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యాచారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ జోష్ ఇలాగే కొనసాగాలి

- కష్టపడితే అధికారం ఖాయం
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి




చేవెళ్లలో సున్నపు వసంతం ఆధ్వర్యంలో ర్యాలీ

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోష్ చూస్తుంటే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అయితే ఈ జోష్ ఇలాగే కొనసాగాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కోరారు. బుధవారం చేవెళ్లలో మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలసి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలని, అధికారమే లక్ష్యంగా పని చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని చెప్పారు. చేవెళ్ల అంటేనే కాంగ్రెస్ అని.. కొంచెం కష్టపడితే చాలు అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు చేవెళ్లలో పార్టీ నేత సున్నపు వసంతం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డీసీసీ నాయకులు పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, పడాల రాములు, మధుసూదన్ గుప్తా, యాలాల మహేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, రాములు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో విద్యార్థి–యువజన సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి–యువజన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి కేటీఆర్ అనేక పరిశ్రమలు స్థాపిస్తున్నట్లు తెలిపారు. 2014 నుంచి ఇప్పటి వరకు ప్రైవేట్ సెక్టార్‌లో 18 లక్షల మందికి, ప్రభుత్వ రంగంలో లక్షా 37 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మరో 40వేల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం నోటిఫికేషన్లు వేస్తున్నట్లు తెలిపారు. ఎంకేఆర్ ఫౌండేషన్ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వడం వల్ల నియోజకవర్గంలోని 1,100 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో పట్టుబట్టి ఫాక్స్‌కాన్ కంపెనీని కొంగరకలాన్‌లో ఏర్పాటు చేస్తున్నామని, 10 నుంచి 20 వేల మందికి ఈ కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలనే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఫార్మాసిటీలో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదేవిధంగా ఎల్మినేడులో రెండు పెద్ద కంపెనీలు వస్తున్నట్లు వెల్లడించారు. ఎక్కడాలేని విధంగా యువతకు నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 2,,931 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసినట్లు ఆయన వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని చెప్పారు. రూ.9.21 కోట్లతో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సుందరీకరించనున్నట్లు పేర్కొన్నారు. ధరణిలోని సమస్యలను మరో నెలరోజుల్లో పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ మాట్లాడుతూ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తి సిగ్గు లేకుండా ఈ నియోజవర్గంలో తిరుగుతున్నాడని.. అతనికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ జంగమ్మ, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు జెర్కొని రాజు, నిట్టు జగదీశ్వర్, శివసాయి, రాజ్‌కుమార్, అరవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యార్థి–యువజన సమ్మేళనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు బైక్ ర్యాలీతో తరలివచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



సమ్మేళనానికి హాజరైన జనం

ఆర్థిక సాయంపై ఆశలు

- రూ.లక్ష సహాయానికి దరఖాస్తుల వెల్లువ
- క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్: కులవృత్తుల వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించే పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగా, మున్సిపాలిటీల్లో కొనసాగుతోంది. దరఖాస్తు పరిశీలన ప్రక్రియ పూర్తి కావస్తుండటంతో ఆర్థిక సాయంపై దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో ఆరా..

ఆర్థిక సహాయం కోసం భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. మండలాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్‌ల ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టారు.. దరఖాస్తుదారుల వయస్సు, గతంలో బీసీ కార్పొరేషన్ రుణం తీసుకున్నారా లేదా, ఆర్థిక స్థోమత, కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా, దరఖాస్తుదారులు స్థానికంగా ఉంటున్నారా లేదా వంటి తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. సేకరించిన వివరాలను జిల్లా కమిటీకి నివేదించనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనుంది. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను మండల, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తారని అధికారులు చెబుతున్నారు.

ప్రతి మూడు నెలలకోసారి పరిశీలన

ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు తమ యూనిట్‌కు సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. లబ్ధిదారుడు యూనిట్‌ను సక్రమంగా వినియోగిస్తున్నాడా లేదా అనేది రెండేళ్ల పాటు ప్రతి మూడు నెలలకోసారి పరిశీలిస్తారు. వితంతువులు, దివ్యాంగులు, సంచార జాతుల వారు, అత్యంత నిరుపేదలు, ప్రస్తుతం స్థానికంగా ఉండి దుకాణాలు నిర్వహిస్తున్న వారు, చేతి వృత్తి చేసుకునే వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా, షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 581, ఫరూఖ్‌నగర్‌లో 964, చౌదరిగూడలో 583, కేశంపేటలో 807, కొందుర్గులో 423, కొత్తూరులో 435, నందిగామలో 434 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

వందశాతం రాయితీ

కుల వృత్తులపై ఆధారపడిన వారికి రూ.లక్ష సాయాన్ని వందశాతం రాయితీపై అందించనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని ఉపయోగించుకొని వృత్తిలో సాంకేతికతను జోడించి ఆర్థిక ఉన్నతికి బాటలు వేసుకోవాల్సి ఉంటుంది. ముడి సరుకులు, పరికరాల కొనుగోలు కోసం ఈ సాయాన్ని ఉపయోగించుకునేందుకు వెసులుబాటు కల్పించనున్నారు. దరఖాస్తులు పెద్దఎత్తున రావడంతో లబ్ధిదారుల ఎంపిక ఎలా ఉంటుందోనని అర్హులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రతి నెల 15వ తేదీన సాయం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఒకేసారి సాయం అందిస్తారా, విడతల వారీగా అందజేస్తారా అనేది తెలియాల్సి ఉంది.



షాద్‌నగర్ మున్సిపాలిటీలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

పారదర్శకంగా పరిశీలన



ప్రభుత్వం అందించే రుణం కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన పారదర్శంగా కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాం

– వెంకన్న, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

ఉన్నతాధికారులకు నివేదించాం



బీసీ రుణాల కోసం గ్రామాల్లో రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. స్థానికంగా ఉండి చేతివృత్తులు చేసుకునే వారికి మొదటి విడత రుణం మంజూరులో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుంది

– వినయ్‌కుమార్, ఎంపీడీఓ, ఫరూఖ్‌నగర్

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

● ముగ్గురికి తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీకి చెందిన సుభాష్, స్నేహితులు.. నాగేందర్, అజయ్‌కుమార్, భరత్‌కుమార్‌తో వర్నా కారులో మంగళవారం అర్ధరాత్రి ఉప్పల్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వస్తుండగా రామోజీ ఫిల్మ్‌సిటీ(ఆర్‌ఎఫ్‌సీ) గేటు ఎదురుగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారును నడిపిస్తున్న నాగేందర్ ఎడమ కాలు విరిగిపోవడంతో పాటు అజయ్‌కుమార్, భరత్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెమలి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి సాయిబాబా దేవాలయం సమీపంలో బుధవారం ఓ మయూరం (నెమలి) మృతి చెందింది. స్థానికులు గుర్తించి ఆదిబట్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అటవీశాఖ సిబ్బందికి నెమలి కళేబరాన్ని అప్పగించారు. ఫారెస్టు సిబ్బంది హన్మంతు నెమలికి అంత్యక్రియలు నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

శంషాబాద్ రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రషీద్‌గూడ, పోశెట్టిగూడలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధితో సమానంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీలేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రూ.1,22,00,000లతో గ్రామంలో పంచాయతీ భవనం, బీటీ రోడ్డు మరమ్మతులు, మురుగు కాలువ పనులు, సీసీరోడ్లు, పోశెట్టిగూడలో డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రాణిరవి, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, సొసైటీ చైర్మన్ దొనాకర్‌గౌడ్, డైరెక్టర్ మోహన్‌రావు, ఉప సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ధనపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



నల్లవారిపల్లిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. ప్రతి గిరిజన తండాకు బీటీ రోడ్డు నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. మాడ్గుల మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, నల్లవారిపల్లి, శనిగలగుట్టతండా, గోప్యాతండా, గాంగ్యానగర్‌తండాలకు రూ.15 కోట్లతో నిర్మించే బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో రూ.100 కోట్లతో గిరిజన తాండాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం మాడ్గుల మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ రవితేజ, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జైపాల్ రెడ్డి, పాండుగౌడ్, కృష్ణమ్మ, పుష్పలత, సర్పంచ్‌లు శ్రీకాంత్, పార్వతమ్మ, యాదిరెడ్డి, వసురాం నాయక్, హన్మా నాయక్, తిరుపతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’కి రూ.6 లక్షలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

కొందుర్గు: గృహలక్ష్మి పథకానికి రూ.6లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌లో బుధవారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్య తదితర హామీలిచ్చిన ప్రభుత్వం నేటికీ నెరవర్చలేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకంలో కేవలం రూ.3లక్షలు ఇస్తే ఇంటి నిర్మాణం పూర్తవుతుందా అని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కార్డుల కోసం చాలా మంది పేదలు ఎంతగానో ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమస్యల సాధన కోసం గురువారం ఇందిరా పార్క్ వద్ద చేపడుతున్న ధర్నాకు అన్ని గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బాల్‌రాజ్, చిన్నయ్య, అనంతలక్ష్మి, బాలమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో బూర్గుల విద్యార్థుల సత్తా

షాద్‌నగర్‌రూరల్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ అనే అంశంపై పాఠశాల స్థాయి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. చిలుకూరులోని ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండల పరిధిలోని బూర్గుల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు చంద్రశేఖర్(10వ తరగతి), రాధాకృష్ణ(8వ తరగతి) జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. వారికి ఆర్‌బీఐ అధికారి శ్రీనివాస్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రమేశ్ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా స్థాయిలో అత్యుతమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచినందుకు బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ఎంపీపీ అనితపై అవిశ్వాసం!

ఆర్డీఓకు నోటీసు ఇచ్చిన సొంతపార్టీ ఎంపీటీసీలు



ఎంపీపీ అనిత

ఆమనగల్లు: ఆమనగల్లు ఎంపీపీ అనితపై అవిశ్వాస తీర్మాణం పెట్టేందుకు ఎంపీటీసీ సభ్యులు కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. సొంత పార్టీకి చెందిన నేతలే ఎంపీపీ అనితపై అవిశ్వాస తీర్మాణం పెట్టడం విశేషం. ఆమనగల్లు మండల పరిషత్ పరిధిలో 5 ఎంపీటీసీ స్థానాలుండగా గత ఎన్నికల్లో 5 ఎంపీటీసీ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకోగా ఆ పార్టీకి చెందిన మేడిగడ్డ ఎంపీటీసీ అనిత ఎంపీపీగా, మంగళపల్లి ఎంపీటీసీ జక్కు అనంతరెడ్డి వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఎంపీపీ అనిత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో విభేదించి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి వర్గంలో చేరారు. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా ఎంపీపీ అనితను పదవినుంచి దించేందుకు మిగతా ఎంపీటీసీలు ప్రయత్నిస్తున్నారు. కాగా ఎంపీపీ అనితపై అవిశ్వాసం ప్రకటిస్తూ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కోనాపూర్ ఎంపీటీసీ సరిత, పోలెపల్లి ఎంపీటీసీ దోనాదుల కుమార్, ఆకుతోటపల్లి ఎంపీటీసీ నిట్టె మంగమ్మ సంతకాలు చేసి ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు నోటీసు అందించినట్లు తెలుస్తుంది.

సంపులో పడి కార్మికుడి మృతి



షాద్‌నగర్‌రూరల్: ప్రమాదవశాత్తు సంపులో పడి కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని బుచ్చిగూడ గ్రామానికి చెందిన నరేశ్‌యాదవ్(35) బాలాజీ ఫుడ్ అండ్ సీడ్స్ పరిశ్రమలో తాత్కాలిక కార్మికుడిగా పని చేస్తున్నాడు. మూడు రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండడంతో యాజమాన్యం తాత్కాలిక సిబ్బందితో పని చేయించుకుంటోంది. ఈ క్రమంలో తాత్కాలిక కార్మికుడు నరేశ్‌యాదవ్ పరిశ్రమలోని మురికి నీటిశుద్ధి యంత్రం(ఈటీపీ) సంపులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం బురదలో చిక్కుకోవడంతో బయటకు తీసేందుకు వీలు కాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో సంపులోని నీటిని తీసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సహాయక చర్యలను చేపట్టారు. తాత్కాలిక సిబ్బంతో పని చేయించుకోవడంతోనే ఈ ఘటన జరిగిందని, పరిశ్రమ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంక్షేమ సంఘం నాయకుడు పినపాక ప్రభాకర్ డిమాండ్ చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న ఎత్‌మార్‌పల్లి రైతులు

మొయినాబాద్ రూరల్: రైతుల సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లిలో రైతులు ఆరు నెలలుగా లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అధికారులు వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. దీంతో బుధవారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చింతకింది ప్రవీణ్‌రెడ్డితో కలిసి రైతులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడు రైతులకు అండగా ఉంటుందని చెప్పారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు సుధాకర్

ఇబ్రహీంపట్నం: ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు రాక సుధాకర్ అన్నారు. జ్ఞాన సరస్వతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినోభానగర్‌లోని సాధన కుటీర్‌లో నిర్వహిస్తున్న వక్త ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొప్ప వక్తగా ఎదగాలంటే ముఖ్యంగా మూడు విషయాలపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఎల్లప్పుడు తన హృదయంతో వక్త మాట్లాడాలని, ఆచరించిన మాటలనే చెప్పాలని, చెప్పే విషయాలు సమాజానికి ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌ఎఫ్ వ్యవస్థాపకుడు సదా వెంకట్‌రెడ్డి, ప్రముఖ సెలబ్రిటీ కోచ్ ఆనంద్, స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ డైరెక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే తృతీయ స్థానం



డిపోలో వేడుకలు జరుపుకుంటున్న ఉద్యోగులు, కార్మికులు

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్‌రాజు

ఇబ్రహీంపట్నం: కార్మికుల సమష్టి కృషి ఫలితంగానే రాష్ట్రస్థాయిలో తృతీయ ఉత్తమ ఆర్టీసీ డిపోగా ఇబ్రహీంపట్నం నిలిచిందని ఆ డిపో మేనేజర్ అశోక్‌రాజు అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతులమీదుగా ఉత్తమ అవార్డు, రూ.2లక్షల నగదు పురస్కారం అందుకున్న ఆయన బుధవారం ఇబ్రహీంపట్నం డిపోలో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. డీఎం మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్న డిపోను లాభాల బాట పట్టించింది ఆర్టీసీ సిబ్బంది, కార్మికులేనన్నారు. ఇదేవిధంగా సమష్టి కృషితో ఆదాయాన్ని పెంచి ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ సరస్వతి, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం



ఇంటింటి ప్రచారంలో ఆచారి, నాయకులు

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

కడ్తాల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత ఆచారి స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గడపగడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆచారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి కేంద్ర పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత మోహన్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, మహేశ్, సాయిలాల్, కుమార్, సాయిప్రభు, శేఖర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

‘బ్రైటర్ మైండ్స్’తో ఆలోచనల్లో మార్పు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కన్హా శాంతి వనం పీఆర్వో చంద్రారెడ్డి

నందిగామ: మండల పరిధిలోని కన్హ శాంతి వనంలో పదిరోజుల క్రితం ప్రారంభమైన బ్రైటర్ మైండ్స్ శిక్షణ బుధవారం ముగిసిందని పీఆర్ఓ చంద్రారెడ్డి తెలిపారు. ఈ శిక్షణలో 8 నుంచి 15 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులు సుమారు 200మంది పాల్గొన్నారన్నారు. బ్రైటర్ మైండ్స్ శిక్షణతో విద్యార్థులలో ఆలోచన విధానంలో మార్పు వస్తుందని, మెదడు చురుక్కుగా పనిచేస్తుందని చెప్పారు. విద్యార్థులు ఇలాంటి శిక్షణ తీసుకున్నట్లయితే జ్ఞాపకశక్తి పెరగడటమే కాకుండా పోటీ ప్రపంచంలో ముందుండే అవకాశం ఉంటుందన్నారు.

పిల్లల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి తల్లి తండ్రుల వద్దకు చేర్చడం, అనాథలకు పునరావాసం కల్పించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ తొమ్మిదో సమన్వయ సమావేశం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ ఆఫీస్‌లో బుధవారం జరిగింది. సీపీ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. తప్పిపోయిన చిన్నారుల వివరాలను సేకరించి వారి ఫోటోలు కలిగిన ఆల్బమ్‌ను రూపొందిస్తారని, ఆయా వివరాలతో ప్రత్యేక టీమ్‌లు కమిషనరేట్ పరిధిలో అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్టాండ్లను, జనసామర్థ్యం కలిగిన జంక్షన్లు, చౌరస్తాలు, నిర్మాణ స్థలాలు, హోటళ్లు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లను తనిఖీ చేస్తారని వివరించారు. వెట్టి చాకిరిలో ఉన్న బాలబాలికల విముక్తి కోసం కూడా ఈ ప్రత్యేక టీమ్‌లు పని చేస్తాయని చెప్పారు. పిల్లల అక్రమ రవాణా, బాల కార్మికులుగా పిల్లలను నియమించుకుని వారి చేత పని చేయించుకునే వారి మీద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టడానికి ఒక ఎస్.ఐ, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు కలిగిన మఫ్టీలో ఉండే ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన పిల్లల ఫొటోలతో కూడిన సమాచారాన్ని చైల్డ్ ట్రాక్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, షీటీమ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ చంద్రబాబు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాదారులపై నిఘా...

మానవ అక్రమ రవాణాదారులపై సైబరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బాలికలు, మహిళలను అక్రమంగా రవాణా చేస్తూ, వారితో వ్యభిచారం చేయిస్తున్న నేరస్తులపై నిఘా పెట్టారు. సెక్స్ రాకెట్ నిర్వాహకులు, మధ్యవర్తులు, పాత నేరస్తుల రికార్డును ఏర్పాటు చేశారు. బీట్ పోలీసింగ్, లోకల్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌లో ఆయా వివరాలను ట్రాకింగ్ చేస్తుంటారు. బుధవారం మేడ్చల్, మాదాపూర్, బాలానగర్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లలో మానవ అక్రమ రవాణాదారులపై గస్తీ నిర్వహించారు. నిఘా వల్ల నేరాలు పునరావృతం కాకుండా నిరోధించవచ్చని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.